సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 9 । జూలై । 2025



వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్‌ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె రాజు, ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు

అప్పన్నా.. వస్తున్నాం..

నేడే సింహగిరి ప్రదక్షిణ

- మధ్యాహ్నం 2 గంటలకు పుష్పరథం ప్రారంభం
- రేపు వేకువజాము 3 గంటల నుంచి ఆలయ ప్రదక్షిణ



ముస్తాబైన పుష్పరథం



తొలి పావంచా



సింహాచలం: సింహగిరి ప్రదక్షిణకు సమయం ఆసన్నమైంది. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేంజేసిన 32 కిలోమీటర్ల కొండ చుట్టూ ప్రదక్షిణ చేసే సమయం వచ్చింది. ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని బుధవారం గిరి ప్రదక్షిణ ఉత్సవం జరగనుంది. ఈ ఏడాది సుమారు 6 లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారని అంచనా వేశారు. ఈ మేరకు కలెక్టర్‌ హరేందిర ప్రసాద్‌, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసింది.

సింహగిరికి మెట్లమార్గంలో అనుమతి

గురువారం కొండపైకి కేవలం మెట్లమార్గంలో మాత్రమే అనుమతి ఇస్తారు. ఆరోజు ఉదయం 3 గంటల నుంచి భక్తుల రద్దీ ముగిసే వరకు కొండదిగువకి వచ్చే భక్తులను దేవస్థానం బస్సులు, దేవస్థానం అద్దె చెల్లించిన 50 ఆర్టీసీ బస్సుల్లోను ఉచితంగా చేరవేస్తారు.

దర్శన సమయాలు

బుధవారం ఉదయమే గిరి ప్రదక్షిణ ప్రారంభించి అదేరోజు రాత్రి చేరుకునే భక్తులకు రాత్రి 9 గంటల వరకు స్వామివారి దర్శనాలు లభిస్తాయి. ఆ తర్వాత తిరిగివారికి 10వ తేదీ ఉదయం 5.30 నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందజేస్తారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు దర్శనాలు ఉండవు. తిరిగి సాయత్రం 5.30 గంటల నుంచి దర్శనాలు లభిస్తాయి.

రేపు ఆలయ ప్రదక్షిణ

ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం 3 గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతిస్తారు. ఆలయ బాహ్య ప్రకారం చుట్టూ 400 మీటర్ల మేర ప్రదక్షిణ చేయాల్సి ఉంటుంది. ఆలయ ప్రదక్షిణలకు సంబంధించి ఉత్తర రాజగోపురం వద్ద, దక్షిణ రాజగోపురం వద్ద వంతెలను ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌ హరేందిర ప్రసాద్‌

ఏర్పాట్లు ఇలా..



గిరిప్రదక్షిణ మార్గంలో స్టాల్స్‌

- సింహాచలంలోని తొలిపావంచా వద్ద బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు కొబ్బరికాయ కొట్టి రథం ప్రారంభిస్తారు.
- అక్కడ భక్తులు కొబ్బరి కాయలు కొట్టేందుకు 45 క్యూలు, 100 ఇనుమ గడ్డర్లు ఏర్పాటు చేశారు.
- అడవివరం–హనుమంతవాక బీఆర్‌టీఎస్‌ మార్గంలో రెండో టోల్‌గేట్‌ వద్ద నుంచి ప్రదక్షిణ ప్రారంభించే భక్తుల సౌకర్యార్థం కొబ్బరికాయలు కొట్టేందుకు 20 ఇనుమ గడ్డర్లు ఏర్పాటు చేశారు. అక్కడ స్వామివారి నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేశారు.
- 177 శాశ్వత మరుగుదొడ్లకు అదనంగా మరో 500 తాత్కాలిక మరుగుదొడ్లు జీవీఎంసీ ఏర్పాటు చేసింది.
- వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు షిఫ్ట్‌కి 640 మంది చొప్పున మూడు షిఫ్టలకు 1,920 మంది కార్మికులను ఏర్పాటు చేశారు.
- ప్రతీ 200 మీటర్లకు ఒకటి చొప్పున మొత్తం 132 తాగునీటి పాయింట్లు జీవీఎంసీ ఏర్పాటు చేసింది.
- అప్పుఘర్‌ వద్ద 5 బోట్లు, 60 మంది గజ ఈతగాళ్లు, హైపవర్‌ లైటింగ్‌ ఏర్పాటు చేశారు.
- 32 చోట్ల వైద్య శిబిరాలు, 18 అంబులెన్సులు, రెండు సూపర్‌ స్పెషాలిటీ వైద్య బృందాలు ఏర్పాటు చేశారు.
- 32 ప్రదేశాల్లో 200 వాట్స్‌ సామర్థ్యం కలిగిన 750 విద్యుత్‌ దీపాలు ఏర్పాటు చేశారు. 9 జనరేటర్లు అందుబాటులో ఉంచారు.
- నగర సీపీ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో 2,460 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.
- ప్రతీ ఆరు కిలోమీటరుకు ఒక బృందం చొప్పున మూడు షిఫ్టల్లో ఆరు బృందాలను కలెక్టర్‌ హరేందిర ప్రసాద్‌ నియమించారు. డిప్యూటీ కలెక్టర్‌ ర్యాంకు అధికారి పర్యవేక్షణలో ఒక్కో బృందంలో ఎన్‌డీఆర్‌ఎఫ్‌, ఎస్డీఆర్‌ఎఫ్‌, ఫైర్‌, పోలీస్‌, వైద్య, విద్య, విద్యుత్‌, రెవెన్యూ, జీవీఎంసీ, ఆర్‌అండ్‌బీ, రవాణాశాల అధికారులు, సిబ్బంది ఉంటారు.
- బుధవారం ఉదయం 6 నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్‌ ఆంక్షలు ఉంటాయి.
- భక్తులకు అందుబాటులో టోల్‌ ఫ్రీనెంబరు 1800–4250–0009, 0891–2507225లను ఏర్పాటు చేశారు.



సింహగిరిపై దర్శనం క్యూలు

- కొండదిగువ తొలిపావంచా, అడవివరం, పాత గోశాల జంక్షన్‌, అప్పుఘర్‌, మాధవధారలో పబ్లిక్‌ అడ్రసింగ్‌ సిస్టంలు ఏర్పాటు చేశారు.
- జోడుగుళ్లపాలెం వద్ద సముద్రస్నానాలకు అనుమతి ఇవ్వలేదు.
- లుంబిని పార్క్‌ వద్ద తాత్కాలిక స్నానపు గదులు, టాయ్‌లెట్లు, తాగునీరు ఏర్పాటు చేశారు.
- గిరి ప్రదక్షిణ మార్గంలో పాఠశాలలు, కల్యాణ మండపాల్లో మొత్తం 14 చోట్ల విశ్రాంతి ప్రాంతాలను గుర్తించారు.
- 10న సింహగిరిపై అన్నప్రసాద భవనంలో కదంబం, దద్దోజనం అన్నప్రసాదంగా అందజేస్తారు.
- ఉచిత, రూ.100, రూ..300 దర్శనాల క్యూలను ఏర్పాటు చేశారు.
- భక్తుల కోసం సుమారు లక్ష లడ్డూలను విక్రయానికి సిద్ధం చేశారు.

200 ఆర్టీసీ బస్సులు

డాబాగార్డెన్స్‌: గిరిప్రదక్షిణ భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ 200 ప్రత్యేక సర్వీసులు నడుపుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. సింహాచలం కొండపై నుంచి దిగువకు 50 బస్సులు, సింహాచలం నుంచి ద్వారకా బస్‌స్టేషన్‌, గాజువాక, ఆర్కే బీచ్‌, కొత్తవలస తదితర ప్రాంతాలకు సుమారుగా 150 బస్సులు నడుపుతున్నట్టు చెప్పారు. ఈ బస్సులు బుధవారం ఉదయం 5 నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్‌ రద్దీని బట్టి నడపనున్నట్టు చెప్పారు.

32 కి.మీ మేర సౌకర్యాలు

డాబాగార్డెన్స్‌: గిరి ప్రదక్షిణకు జీవీఎంసీ పక్కా ఏర్పాట్లు చేసిందని కమిషనర్‌ కేతన్‌ గార్గ్‌ తెలిపారు. భక్తుల కోసం 32 కి.మీ మేర సౌకర్యాలు కల్పించామన్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రసాద వితరణకు ప్లాస్టిక్‌ ప్లేట్లు, గ్లాసులు, కవర్లు, స్పూన్లు, ఫోర్క్‌లు వంటివి కాకుండా పర్యావరణ హితమైన వస్తువులు ఉపయోగించాలని కోరారు.

ఏర్పాట్ల పరిశీలన : గిరిప్రదక్షిణ ఏర్పాట్లను మంగళవారం జేసీ మయూర్‌ అశోక్‌ పరిశీలించారు. భక్తులకు ప్రదక్షిణ మార్గం తెలిసేవిధంగా సూచిక బోర్డులు ఎక్కువగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈవో త్రినాథరావు ఏర్పాట్లను జేసీకి వివరించారు.

విశాఖ అభివృద్ధి ప్రదాత వైఎస్సార్‌

- వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు
- పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలు

సాక్షి, విశాఖపట్నం: మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా.. విశాఖ నగర అభివృద్ధిపై ఆయన వేసిన ముద్ర చెరగనిదని, ఆయన జ్ఞాపకాలు మరువలేనివని వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. మంగళవారం మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో యువజన విభాగం ఆధ్వర్యంలో వైఎస్సార్‌ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌ విగ్రహానికి ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, తిప్పల దేవన్‌రెడ్డిలతో కలిసి కె.కె.రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ కట్‌ చేశారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ యువజన విభాగం నాయకులు ఉరుకూటి చందు, అబంటి శైలేష్‌, దొడ్డి కిరణ్‌, మహ్మద్‌ ఇమ్రాన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కె.కె.రాజు ప్రారంభించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు, యువజన విభాగం కార్యకర్తలు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. అనంతరం కె.కె.రాజు మాట్లాడారు. 'ప్రజల కోసం నిరంతరం పరితపించిన గొప్ప వ్యక్తి వైఎస్సార్‌. పేదల జీవన ప్రమాణాలు పెరగాలని, ప్రతి ఇంట్లో పిల్లలు ఉన్నత చదువులు చదవాలని ఆయన ఆకాంక్షించారు. విశాఖకు అంతర్జాతీయ విమానాశ్రయం, అచ్యుతాపురం సెజ్‌, ఐటీ పరిశ్రమలు తీసుకువచ్చిన ఘనత ఆయనదే. విశాఖ అభివృద్ధిలో వైఎస్సార్‌ హయాంకు ముందు, తర్వాత అనే తేడా సుస్పష్టంగా కనిపిస్తుంది.' అని కొనియాడారు. ఎంపీ గొల్ల బాబూరావు మాట్లాడుతూ.. తండ్రి వైఎస్సార్‌ బాటలోనే ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ఐదేళ్ల పాటు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించారని గుర్తుచేశారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, డిప్యూటీ మేయర్‌ కె.సతీష్‌, పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవిరెడ్డి, ముఖ్య నేతలు కోలా గురువులు, బొల్లవరపు జాన్‌ వెస్లీ, పేర్ల విజయ చంద్ర, బానాల శ్రీనివాసరావు, రొంగలి జగన్నాథం, వుడా రవి, అల్లంపలి రాజాబాబు, ఐహెచ్‌ ఫరూఖీ, డాక్టర్‌ జహీర్‌ అహ్మద్‌, అనిల్‌కుమార్‌రాజు, పి.సతీష్‌ వర్మ, మంత్రి రాజశేఖర్‌, నడిపంపల్లి కృష్ణం రాజు, కిరణ్‌ రాజు, రవిరాజు, మాధవీవర్మ, ద్రోణంరాజు శ్రీవత్సవ్‌, అల్లు శంకరరావు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పేడాడ రమణి కుమారి, బోని అప్పల నాయుడు, బోని శివరామకృష్ణ, బర్కత్‌ అలీ, సేనాపతి అప్పారావు, పీలా ప్రేమ కిరణ్‌ జగదీష్‌, కె.రామిరెడ్డి, వంకాయల మారుతీ ప్రసాద్‌, బొండా ఉమా మహేశ్వరరావు, జీలకర్ర నాగేంద్ర, దేవరకొండ మార్కండేయులు, నీలి రవి, పార్టీ కార్యదర్శులు, అనుబంధ విభాగం ఉపాధ్యక్షులు, అనుబంధ విభాగం జోనల్‌ అధ్యక్షులు, అనుబంధ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగం అధ్యక్షులు, పార్టీ అధికారిక ప్రతినిధులు, మండల అధ్యక్షులు, డివిజన్‌ అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగం సభ్యులు, మండల కమిటీ సభ్యులు, వార్డు కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగం కమిటీ సభ్యులు, మండల అనుబంధ విభాగం అధ్యక్షులు, కమిటీ సభ్యులు, డివిజన్‌ అనుబంధ విభాగం అధ్యక్షులు, కమిటీ సభ్యులు, పోలింగ్‌ బూత్‌ అధ్యక్షులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ పాలనలో సామాజిక సమానత్వం

– ఎంపీ గొల్ల బాబూరావు



బీచ్‌రోడ్డులో మహానేత వైఎస్సార్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె రాజు, ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కోలా గురువులు, మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, కార్పొరేటర్లు, ఇతర సీనియర్‌ నాయకులు

ఏయూక్యాంపస్‌: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి తన పాలనతో రాష్ట్రంలో సామాజిక సమానత్వానికి బాటలు వేశారని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. వైఎస్సార్‌ జయంతి సందర్భంగా బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె రాజుతో కలిసి ఎంపీ పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌ అందించిన అభివృద్ధి ఫలాలు, సంక్షేమ పథకాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కె.కె రాజు మాట్లాడుతూ రాజకీయాలకు వన్నె తెచ్చి, ప్రత్యర్థులు సైతం కొనియాడే విధంగా వైఎస్సార్‌ పాలన సాగించారని గుర్తు చేశారు. 'తూర్పు' సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ముఖ్య నేతలు కోలా గురువులు, బానాల శ్రీనివాసరావు, ఐహెచ్‌ ఫరూఖీ, జహీర్‌ అహ్మద్‌, బోని శివరామకృష్ణ, పీలా వెంకట లక్ష్మి, రవి రెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో మరో సబ్‌ వే

- రూ.12.5 కోట్లతో కాకానినగర్‌ హైవేపై నిర్మాణం
- టెండర్ల ప్రక్రియను చేపట్టిన వీఎంఆర్‌డీఏ
- ఎన్‌ఏడీ నుంచి ఎయిర్‌పోర్టు మధ్య ట్రాఫిక్‌ రద్దీ తగ్గించేందుకే..



సబ్‌ వే ప్లాన్‌

విశాఖ సిటీ: నగరంలో మరో సబ్‌ వే త్వరలో అందుబాటులోకి రానుంది. ఎన్‌ఏడీ కొత్త రోడ్డు నుంచి ఎయిర్‌పోర్టు మధ్య ట్రాఫిక్‌ రద్దీ నియంత్రణకు వీఎంఆర్‌డీఏ ప్రణాళికలు సిద్ధం చేసింది. రూ.12.5 కోట్లతో కాకానినగర్‌ హైవే జంక్షన్‌లో అండర్‌ పాస్‌ నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ బోర్డు కూడా ఆమోద ముద్ర వేసింది. దీంతో ఈ పనులను వేగవంతంగా చేపట్టేందుకు అధికారులు టెండర్ల ప్రక్రియను చేపట్టారు. దీని ద్వారా ఎన్‌డీఏ–ఎయిర్‌పోర్టు మధ్య రాకపోకలు సులభతరం కానున్నాయి. ఎన్‌డీఏ కొత్త రోడ్డు జంక్షన్‌లో ట్రాఫిక్‌ సమస్యను అధిగమించేందుకు వీఎంఆర్‌డీఏ ఇప్పటికే రోటరీ విధానంలో ఫ్లై ఓవర్‌ను నిర్మించింది. ఫ్లై ఓవర్‌పై భారీ వాహనాలు, కింద రోడ్డులో 3/2 చక్ర వాహనాలు, పాదచారులకు వెళ్లేలా డిజైన్‌ చేశారు. దీంతో నాలుగు రోడ్ల జంక్షన్‌ మధ్య ట్రాఫిక్‌ ఇబ్బందులు తొలిగాయి.

84 మీటర్ల దూరంగా ట్రాఫిక్‌ రద్దీ

ఎన్‌ఏడీ కొత్త రోడ్డులో ట్రాఫిక్‌ సమస్య తొలగినప్పటికీ.. అక్కడకు కేవలం 84 మీటర్ల దూరంలో ట్రాఫిక్‌ రద్దీ ఇబ్బందికరంగా మారింది. రైల్‌ ఓవర్‌ బిడ్జ్‌ ల్యాండ్‌ అయిన వెంటనే కాకానినగర్‌ జంక్షన్‌లో ట్రాఫిక్‌ నిలిచిపోతోంది. ఎన్‌ఏడీ వద్ద తొలగిన సమస్య 100 మీటర్లు దాటకముందే ఉత్పన్నమవుతోంది. అనేక సందర్భాల్లో కాకానినగర్‌ నుంచి ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్‌ వరకు ట్రాఫిక్‌ స్తంభించిపోతోంది. ఉదయం 6 నుంచి 10 గంటల మధ్య, సాయంత్రం 4 నుంచి రాత్రి వరకు ఈ రహదారిలో ప్రయాణం కష్టంగా మారుతోంది. దీంతో కాకానినగర్‌ జంక్షన్‌లో సబ్‌ వే నిర్మించాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు వెల్లువెత్తాయి.

రూ.12.5 కోట్లతో సబ్‌ వే నిర్మాణం

ఆంధ్రప్రదేశ్‌ అర్బన్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ అసెట్‌ మేనేజ్‌మెంట్‌ లిమిటెడ్‌(ఏపీయూఐఏఎంఎల్‌) వీఎంఆర్‌డీఏతో కలిసి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసింది. ఈ సబ్‌ వే నిర్మాణానికి రూ.12.5 కోట్లతో అంచనాలు రూపొందించింది. నేషనల్‌ హైవే అథారిటీ ఆఫ్‌ ఇండియా నిబంధనలకు అనుగుణంగా ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. దీని ప్రకారం ఆర్‌వోబీ–కాకానినగర్‌ మధ్య 18 మీటర్ల వెడల్పుతో సబ్‌ వే నిర్మించనున్నారు. ఇందులో సర్వీస్‌ రోడ్డుతో పాటు పాదచారులకు వీలుగా ఫుట్‌పాత్‌ ఏర్పాటు చేస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే కాకానినగర్‌ జంక్షన్‌లో వాహనాలు నిలపాల్సిన అవసరం ఉండదు. ఎన్‌ఏడీ నుంచి ఎయిర్‌పోర్టు మధ్య రాకపోకలు సులభతరమవుతాయి. ఈ సబ్‌ వే నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ టెండర్లను ఆహ్వానించింది. 2026, డిసెంబర్‌ నాటికి దీన్ని పూర్తి చేయాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు.

మెగా పీటీఎంకు ఏర్పాట్లు

మహారాణిపేట: ఈ నెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్‌ టీచర్స్‌ మీట్‌(పీటీఎం)కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ ఎం.ఎన్‌.హరేందిర ప్రసాద్‌ ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష, మండల విద్యాశాఖ అధికారులతో మంగళవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. పీటీఎం ఏర్పాట్లు, అతిథుల ఆహ్వానం, మొక్కలు పాఠశాలలకు చేరాయా? లేదా? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం అందరికీ అందించాలన్నారు. ముఖ్యంగా స్టూడెంట్‌ కిట్స్‌ అందరికీ అందేటట్లు, యూనిఫారాలు అందరూ వేసుకునేటట్లు, తల్లికి వందనం రానివారు అప్లై చేసుకునేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలన్నారు. డీఈవో ప్రేమకుమార్‌, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్‌ జె.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ కీర్తి అజరామరం

ఘనంగా మహానేత జయంతి వేడుకలు
వాడవాడలా సేవా కార్యక్రమాల నిర్వహణ

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు మంగళవారం జిల్లాలో ఘనంగా జరిగాయి. ఈ నందర్భంగా ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లోని వైఎస్సార్‌ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌ కట్‌ చేసి వంచిపెట్టారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పేదలకు చీరలు, వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసర సరకులు పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు. వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేశారు. ఆసుపత్రుల్లోని రోగులకు పండ్లు, రొట్టెలు పంచి పెట్టి వారిలో మనోధైర్యాన్ని నింపారు.

–సాక్షి, విశాఖపట్నం



యువత ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉరుకూటి చందు, యువజన విభాగం నాయకులు



అక్కయ్యపాలెంలోని వృద్ధాశ్రమంలో వడ్డన చేస్తున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, రవిరాజు



వేములవలసలో వైఎస్సార్‌ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, పార్టీ నేతలు



9వ వార్డులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, పార్టీ నాయకులు



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో పార్టీ నేతలతో కలిసి కేక్‌ కట్‌ చేస్తున్న పెందుర్తి సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌



పెదగంట్యాడ జంక్షన్‌లో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు



జగదాంబ జంక్షన్‌లో మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న విశాఖ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌, పార్టీ నేతలు

ఎట్టకేలకు తహసీల్దార్ పోస్టుల భర్తీ

డీటీలకు అడ్‌హక్ పద్ధతిలో పదోన్నతి

మహారాణిపేట: రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న పలు తహసీల్దార్ పోస్టుల్లో అదే శాఖకు చెందిన డిప్యూటీ తహసీల్దార్లకు అడ్‌హక్ పద్ధతిలో పదోన్నతి కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 17 మంది డిప్యూటీ తహసీల్దార్లకు అడ్‌హక్ పద్ధతిలో తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ విశాఖ కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ 17 మందిలో విశాఖకు ముగ్గురిని, అనకాపల్లికి ఒకరిని, అల్లూరి సీతారామరాజు జిల్లాకు 13 మందిని కేటాయించారు.

- డిప్యూటీ తహసీల్దార్లు ఎ.సంతోష్ కిరణ్‌ను పెందుర్తి తహసీల్దార్‌గా, సూరిశెట్టి శ్రీనుబాబును ఆనందపురం తహసీల్దార్‌గా, బత్తుల శ్రీనివాసరావును గాజువాక తహసీల్దార్‌గా నియమించారు.
- డిప్యూటీ తహసీల్దార్లు జి.ఆనందరావు, పి.మురళీబాబు, డి.లక్ష్మయ్య, వి.శ్రీనివాసరావు, కె.ప్రసాదరావు, కె.వీరభద్రచారి, డి.అరుణ్ చంద్ర, ఎ.సంధ్య, హెచ్.త్రివేణి, కోట శంకరరావు, రాజ్‌కుమార్, హెచ్.అన్నాజీరావు, ఐ.వెంకట అప్పారావులను అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించారు. అలాగే పి.సత్యనారాయణను అనకాపల్లి జిల్లాకు కేటాయించారు. వీరికి ఆయా జిల్లాల కలెక్టర్లు పోస్టింగులు ఇవ్వాల్సి ఉంటుంది.

కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–కిరండూల్ ప్రయాణికుల రైళ్లు కోరాపుట్ వరకే నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 10వ తేదీ గురువారం విశాఖపట్నం–కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 10న కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటుంది.

- ఈ నెల 10వ తేదీ గురువారం రాత్రి బయలుదేరే విశాఖపట్నం–కిరండూల్ (18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 11వ తేదీ శుక్రవారం కిరండూల్–విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటుంది.

జీరో జెట్టీలో మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

దాబాగార్డెన్స్: ఫిషింగ్ హార్బర్ జీరో జెట్టీలో మంగళవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం లభ్యం కావడంతో స్థానికంగా కలకలం రేగింది. తెప్పల మధ్య తేలియాడుతున్న మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా ఎవరైనా హత్య చేసి పడేశారా? ప్రమాదవశాత్తు వేరే ప్రాంతంలో సముద్రంలో పడి కొట్టుకువచ్చాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని కోరారు.

3 నెలలు మిస్సయితే.. సభ్యత్వం కట్

- డ్వాక్రా సంఘాల సభ్యులకు కొత్త కష్టాలు
- మహిళా వికాసం యాప్‌తో ప్రభుత్వం అడ్డగోలు నిబంధనలు
- ప్రతి నెలా యాప్‌లో ముఖహాజరు తప్పనిసరంటూ హుకుం
- గ్రామాల్లో సభ్యత్వముండి.. నగరాల్లో నివసించే వారికి తప్పని తిప్పలు



డ్వాక్రా సంఘాల సభ్యుల సమావేశం(ఫైల్)

ఎంవీపీకాలనీ: కూటమి ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు కొత్త కష్టాలు మొదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పేరుతో కొత్త నిబంధనలు తెరపైకి తేవడమే ఇందుకు కారణం. డ్వాక్రా రుణాలు, కార్యకలాపాల్లో పారదర్శకత పేరుతో రాష్ట్ర ప్రభుత్వం 'మహిళా వికాసం' పేరిట యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌లో డ్వాక్రా సంఘాల సభ్యుల వివరాలు, బ్యాంకు ఖాతాలు, పొదుపు, రుణాల, సమావేశాల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం విశాఖ జిల్లాలో ఈ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. అయితే ఇంత వరకు బాగానే ఉన్నా నెలవారి సమావేశాల్లో సభ్యుల ముఖ హాజరును యాప్‌లో తప్పనిసరి చేయడంపై వివాదం నెలకొంది. ఏ సభ్యురాలైనా వరుసగా మూడు సమావేశాలకు గైర్హాజరై ముఖ హాజరు వేయకుంటే సభ్యత్వం రద్దుకానుండటమే ఆందోళన కలిగిస్తోంది.

మహిళ వికాసం యాప్ సేవలు ఇలా..

సభ్యుల సమావేశాలు, హాజరు, తీర్మానాలు, రుణాల చెల్లింపులు ఇలా అన్నింటిని మహిళ వికాసం యాప్‌లో ఎప్పటికప్పుడు ఆయా డ్వాక్రా సంఘాల సభ్యులు, ఆర్పీలు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ యాప్‌నకు మెప్మా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్పీ, సీవో, సీఎంఎం, పీడీ లాగిన్‌లు కల్పించారు. ప్రతి అంశాన్నీ ఆయా అధికారులు వారి పరిధిలో అనుమతులు ఇవ్వాల్సి ఉంది. దీంతో పాటు డ్వాక్రా సంఘాల సభ్యులకు అందించే బ్యాంకు రుణాలకు సైతం వీరి అనుమతులు తప్పనిసరి. తొలుత రుణాలకు సభ్యులు చేసుకున్న దరఖాస్తులను ఆర్పీలు పరిశీలించి వారి లాగిన్‌లో ఓకే చేస్తే తరువాత సీవో లాగిన్‌కు వెళుతుంది. సీవో లాగిన్ తరువాత సీఎంఎం లాగిన్, అనంతరం పీడీ లాగిన్‌లలో ఆయా దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాల్సి ఉంది. అనంతరం ఆయా దరఖాస్తులను బ్యాంకులు పరిశీలించి రుణాలు మంజూరు చేయాలి. ఈ విధానం ద్వారా బ్యాంకు రుణాల ప్రక్రియలో జాప్యం చోటు చేసుకోనుంది. అంతేకాకుండా వివిధ హోదాల్లో లంచాలు చెల్లిస్తే తప్ప దరఖాస్తులు ముందుకు కదిలే అవకాశం ఉండదనే వాదన సర్వత్రా వినిపిస్తుంది.

30 శాతం గ్రామీణ సభ్యులే..

విశాఖలోని 8 జోన్ల పరిధిలో 35,090 డ్వాక్రా గ్రూపులు ఉండగా 3,59,599 మంది సభ్యులు ఉన్నారు. ఉపాధి కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి విశాఖ నగరంలో నివసిస్తున్న డ్వాక్రా మహిళలే ఎక్కువ. ఇటువంటివారు 30 శాతం వరకు ఉంటారని మెప్మా వర్గాలు వెల్లడించాయి. వీరంతా గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా సభ్యులుగా ఉంటూ అవసరమైన సమయంలో సమావేశాలకు హాజరై సంఘాలకు ప్రభుత్వం అందించే సేవలను వినియోగించుకుంటున్నారు. మహిళ వికాసం యాప్ ద్వారా ముఖ హాజరు తప్పనిసరి చేయడంతో వీరంతా గ్రామీణ ప్రాంతాల్లోని సంఘాల్లో సభ్యత్వం కోల్పోయే పరిస్థితి నెలకొంది. దశాబ్దాలుగా డ్వాక్రా సేవలు వినియోగించుకుంటున్న మహిళలు ప్రస్తుతం ఆందోళన చెందుతున్నారు.

జోన్	డ్వాక్రా గ్రూపుల సంఖ్య	సభ్యులు
జోన్-1	1,646	17,287
జోన్-2	4,504	45,490
జోన్-3	3,711	37,852
జోన్-4	4026	43,873
జోన్-5	7,203	73,748
జోన్-6	7,999	80,414
జోన్-7	1649	18,379
జోన్-8	4,352	43,556

ముఖ హాజరు తప్పనిసరి సరికాదు



గ్రామాల్లో ఉపాధి లేక నగరంలో ఉంటున్న వేల మంది మహిళలు చిన్నపాటి ఉద్యోగాలతో ఉపాధి పొందుతున్నారు. అవసరమైనప్పుడు డ్వాక్రా సమావేశాలకు హాజరవుతూ ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళ వికాసం యాప్ ద్వారా ప్రతి సమావేశానికి ముఖ హాజరు తప్పనిసరి చేయడం సరికాదు.

– బి.ప్రమీల, డ్వాక్రా సభ్యురాలు

రుణాలు పొందడంలోనూ ఇబ్బందులే..



ప్రస్తుత విధానంలో ఆర్పీ, సీవో, సీఎంఎం, పీడీ లాగిన్‌లతో అనుమతులు తప్పనిసరి చేశారు. ప్రతి అంశాన్నీ ఆయా అధికారులు వారి పరిధిలో పరిశీలించి అనంతరం దరఖాస్తును చివర్లో బ్యాంకుకు పంపించాల్సి ఉంటుంది. దీంతో ఈ విధానంలో డ్వాక్రా సంఘాలు రుణాలు పొందడంలో తీవ్ర జాప్యం చేటుచేసుకోనుంది. ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో సవరించాలి.

– వి.జలజాక్షి, డ్వాక్రా సభ్యురాలు

మత్స్యకారుడి వలకు చిక్కిన 'టోఫిష్'

విలువ రూ.50 లక్షలు!

దాబాగార్డెన్స్: పెద్ద చేప పడిందని సంబరపడిన మత్స్యకారుడికి ఊహించని పరిస్థితి ఎదురైంది. తన వలలో చిక్కింది చేప కాదు.. భారత నౌకాదళానికి చెందిన అత్యంత విలువైన పరికరం అని తెలిసి నివ్వెరపోయాడు. సుమారు రూ.50 లక్షల విలువ చేసే ఈ 'టోఫిష్' కోసం నేవీ అధికారులు గత 7 నెలలుగా గాలిస్తున్నారు.

ఏం జరిగిందంటే.?

విశాఖపట్నం తీరంలో ఇటీవల చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు.. తన వల బరువుగా మారడంతో భారీ చేప పడిందని ఆశపడ్డాడు. కష్టపడి వలను లాగి చూడగా, అందులో చేపకు బదులుగా ఓ వింతైన యంత్రం కనిపించింది. దాన్ని బయటకు తీసే ప్రయత్నంలో అతని వల పూర్తిగా చిరిగిపోయింది. ఆ పరికరం ఏమిటో అర్థంకాక, దాన్ని నేరుగా ఫిషరీస్ శాఖ జాయింట్ డైరెక్టర్ వద్దకు తీసుకెళ్లాడు. ఆయనకు కూడా అది ఏ పరికరమో అంతుబట్టక పోవడంతో మంగళవారం వన్‌టౌన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమాచారం అందుకున్న నేవీ అధికారులు హుటాహుటిన పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అది గతేడాది డిసెంబర్ 14న గల్లంతైన తమ 'టోఫిష్' అని, దాని కోసం అప్పటి నుంచి గాలిస్తున్నామని నేవీ అధికారులు ధ్రువీకరించారు. ఈ పరికరం సబ్‌మెరైన్లలో వాడే కీలకమైన సాధనమని, దీని విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని తెలిపారు. కాగా.. పోలీసులు ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు.

అసలేంటీ 'టోఫిష్'?

'టోఫిష్' అనేది పేరులో ఉన్నట్లు చేప కాదు. ఇది నీటి అడుగున పనిచేసే ఒక అత్యాధునిక సాంకేతిక వాహనం. సముద్ర గర్భాన్ని జల్లెడ పట్టడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. సముద్రపు అడుగుభాగం త్రీడీ మ్యాపింగ్, లోతు కొలతలు, సముద్ర గర్భంలోని వస్తువులను గుర్తించడం దీని ప్రాథమిక విధి. ఇందులో సైడ్-స్కాన్ సోనార్, శబ్ద సెన్సార్లు, నీటి ఉష్ణోగ్రత, లవణీయత వంటి వివరాలను కొలిచే సెన్సార్లు అమర్చి ఉంటాయి. ఇది సముద్రంలో కోల్పోయిన వస్తువులు, విమానాలు లేదా ఓడల శిథిలాలను గుర్తిస్తుంది. శత్రు దేశాల సబ్‌మెరైన్లు, నీటి అడుగున అమర్చిన మైన్‌లను కనిపెడుతుంది. పైప్‌లైన్లు, కేబుల్స్ వేయడానికి సముద్ర గర్భం సురక్షితంగా ఉందో లేదో సర్వే చేస్తుంది. నీటి అడుగున ఉన్న ప్రమాదకరమైన కొండ చరియలు, ఇతర అడ్డంకులను గుర్తిస్తుందని నేవీ అధికారులు తెలిపారు.

జగన్నాథస్వామి ఆదాయం రూ.90.42 లక్షలు

- హుండీల ద్వారా రూ.19.42 లక్షలు
- గత ఏడాదితో పోలిస్తే రూ.4.90 లక్షలు అదనం



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

దాబాగార్డెన్స్: జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా పది రోజులుగా టర్నర్ చౌల్ట్రీలో దశావతరాల్లో భక్తులకు దర్శనమిచ్చిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టారు. ఉత్సవ ప్రధాన అధికారి టి.అన్నపూర్ణ, ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి, దేవదాయ శాఖ తనిఖీదారు ఎం.శ్రీధర్, ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసుల సమక్షంలో చేపట్టిన లెక్కింపులో హుండీల ద్వారా రూ.19 లక్షల 42 వేల 570 ఆదాయం రాగా, రథయాత్ర మహోత్సవాల హుండీలతో కలిపి రూ.90 లక్షల 42 వేల 113 వచ్చింది. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.4 లక్షల 90 వేల 445 అదనంగా వచ్చింది.

14న మహా అన్నదానం..

రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14న టౌన్ కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. స్వామి రథయాత్రకు సహాయ సహకారాలు అందించిన జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్ శాఖ, రోడ్లు, భవనాలు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రణతోస్మి గిరిపౌర్ణమి' ఆల్బమ్ ఆవిష్కరణ



ఆల్బమ్‌ను ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్. చిత్రంలో గంట్ల శ్రీనుబాబు

దాబాగార్డెన్స్: జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, సింహాచలం దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో రూపొందించిన 'ప్రణతోస్మి గిరిపౌర్ణమి' ఆల్బమ్‌ను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేతన్ గార్గ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావనతో ముందుకు సాగాలని, గిరి ప్రదక్షిణ సందర్భంగా ఈ అల్బమ్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. ఇటువంటి భక్తి గీతాలు భక్తులలో మరింత భక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఆల్బమ్‌కు రచన, స్వరకల్పన చేసిన జయప్రభ శర్మ మాట్లాడుతూ అప్పన్న ఉత్సవాలకు సంబంధించిన పాటలను సమకూర్చే అవకాశం లభించడం స్వామి అనుగ్రహంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ భక్తి గీతాన్ని అఖిల, సత్యశ్రీ గానం చేయగా, శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గుడివాడ శ్రీనివాసరావు, భక్తులు కేతినీడి సాయికుమార్, బోకం శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక భక్తి గీతాన్ని ఎస్‌వీఎస్ఎస్ భక్తి చానల్ ద్వారా విడుదల చేశారు.

ప్రతిష్టాత్మకంగా గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు



గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల ప్రణాళికను పరిశీలిస్తున్న హోంమంత్రి అనిత

సింహాచలం: ఈసారి గిరి ప్రదక్షిణ ఉత్సవం నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సింహగిరిపై జరిగిన ఏర్పాట్లను మంగళవారం ఆమె పరిశీలించారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తొలుత ఆమె స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపికను ఈవో త్రినాథరావు అందించారు.

ఆర్టీసీ బస్సులో పొగలు

త్రుటిలో తప్పిన ప్రమాదం



బస్‌లో వ్యాపించిన పొగలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆరిలోవ: శ్రీకాకుళం నుంచి విశాఖ వస్తున్న ఓ ఆర్టీసీ బస్సులో మంగళవారం మధ్యాహ్నం త్రుటిలో ప్రమాదం తప్పింది. బస్సు ఇంజిన్ నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించాడు. ట్రాఫిక్ ఎస్ఐ మురళీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం నుంచి విశాఖకు వస్తున్న ఆర్టీసీ బస్సు జాతీయ రహదారిపై విశాఖ వ్యాలీ స్కూల్ కూడలి వద్దకు చేరుకోగానే ఇంజిన్ నుంచి పొగలు రావడం డ్రైవర్ గమనించారు. వెంటనే బస్సును రోడ్డు పక్కకు ఆపి, ప్రయాణికులందరినీ కిందకు దించేశారు. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక వాహనంలో వచ్చిన సిబ్బంది బస్సు ఇంజిన్ నుంచి వెలువడుతున్న దట్టమైన పొగలను అదుపు చేశారు. బస్సును సకాలంలో ఆపకపోతే మంటలు వ్యాపించి పెద్ద ప్రమాదం జరిగేదని బస్సు డ్రైవర్, ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడం వల్లే పెను ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు.

దాడికి పాల్పడిన నిందితులకు రిమాండ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం గవర రామాలయం వద్ద ఆదివారం రాత్రి కత్తితో దాడికి పాల్పడిన ఆరుగురు నిందితులను గోపాలపట్నం పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. వివరాలివి.. ఆదివారం రాత్రి మద్యం మత్తులో జరిగిన ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులు గాయపడిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సోమవారం ఐదుగురిని అదుపులోకి తీసుకోగా, ప్రధాన నిందితుడు సురేంద్రను మంగళవారం అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో సురేంద్రతో పాటు సూర్యకుమార్, లక్షయ్, దాడి లిఖిత్, సతీష్, రేసు ఆనంద్‌లు ఉన్నారు. సీఐ ప్రభాకర్ పర్యవేక్షణలో ఎస్ఐ రావురావు ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ రాయితీ.. ఏమిటీ దుస్థితి?

- రెండు నెలల నుంచి నగదు కోసం నిరీక్షణ
- ఈ నెలాఖరుతో ముగుస్తున్న రెండో విడత గడువు
- జిల్లాలో 3.71 లక్షల మంది గ్యాస్ లబ్ధిదారులు



మహారాణిపేట: ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంలో సొమ్ము తిరిగి రావడం కష్టంగా మారింది. రోజులు గడుస్తున్నా డబ్బులు పడటం లేదని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. రెండో వాయిదా చెల్లింపుల్లో లబ్ధిదారులకు సర్కార్ చుక్కలు చూపిస్తోంది. మరి కొద్ది రోజుల్లో ఈ పథకం రెండో విడత గడువు ముగుస్తుంది. డబ్బుల కోసం సివిల్ సప్లై డీఎస్‌వో, ఏఎస్‌వోలకు ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నారు. ఈ రోజు, రేపు అంటూ చెప్పి అధికారులు తప్పించుకుంటున్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం మొదటి విడత జనవరిలో పూర్తి అయింది. రెండో విడత ఏప్రిల్‌లో మొదలై జూలై 31తో ముగుస్తుంది. ఎల్‌పీజీ కనెక్షన్, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు అర్హత ప్రామాణికంగా ఈ పథకం అమలు చేస్తున్నారు. అలా గ్యాస్ పొందిన లబ్ధిదారులు ఇప్పుడు తమ ఖాతాల్లో నగదు జమ కావడం లేదని వాపోతున్నారు. జిల్లాలో 3,71,633 మంది ఉచిత గ్యాస్‌కు అర్హులుగా ఉన్నారు. వీరిలో ఏప్రిల్ నుంచి జూలై 8వ తేదీ నాటికి దాదాపు 95 శాతం మేర గ్యాస్ తీసుకున్నారు. ఇందులో 80 శాతం లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ సొమ్ము జమ అయింది. మిగిలిన వారికి ఇంకా జమ కాలేదు. దీంతో రాయితీ నగదు కోసం వారు పడరాని పాట్లు పడుతున్నారు.

'ఉచిత గ్యాస్'కు ఎన్నో మెలికలు..

తెలుపు రేషన్ కార్డు పని చేస్తేనే ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తారు. అలాగే ఈకేవైసీ కూడా ఉండాలి. ఆధార్, బ్యాంకు ఖాతాకు కూడా అనుసంధానమై ఉండాలి. వీటిలో ఏది తేడా వచ్చినా గ్యాస్ సొమ్ము దక్కడం దుర్లభం. కూటమి నాయకులు ఎన్నికల హామీలో భాగంగా, గెలిస్తే ప్రతి ఒక్కరికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ హామీ అమల్లో మాత్రం ఎన్నో మెలికలు పెడుతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం తమను మోసం చేసిందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

సమస్య పరిష్కారానికి సంప్రదించండి..

గ్యాస్ రాయితీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతుంది. పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తున్నారు. డెలివరీ చేసిన 48 గంటల్లో డీబీటీ విధానం ద్వారా లబ్ధిదారుల ఖాతాలో నేరుగా రాయితీ సొమ్ము జమ అవుతుంది. గతంలో లాగే బుకింగ్ చేసిన తర్వాత ఒక ఎస్ఎంఎస్ సంబంధిత లబ్ధిదారుడి ఫోన్‌కు వస్తుంది. ఎవరికి రాకపోయినా మమ్మల్ని సంప్రదించవచ్చు.

–వి.భాస్కర్, డీఎస్‌వో, విశాఖపట్నం

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత



మెటీరియల్ అందజేస్తున్న డాక్టర్ విశ్వేశ్వరరావు, డాక్టర్ రవీంద్రనాథ్

దాబాగార్డెన్స్: విశాఖ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి డాక్టర్ కొనపల విశ్వేశ్వరరావు, డాక్టర్ జంధ్యాల రవీంద్రనాథ్ తాము రచించిన పలు పుస్తకాలను మంగళవారం అందజేశారు. అలాగే పాఠకులు, పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థుల కోసం రిఫరెన్స్ పుస్తకాలు, మెటీరియల్‌ను డిప్యూటీ లైబ్రేరియన్ రాజేంద్ర వర్మకు అందించారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం	: రూ.78
బ్రాయిలర్ (లైవ్)	: రూ.98
స్కిన్	: రూ.166
స్కిన్‌లెస్	: రూ.176

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	540.00
విజయనగరం	544.00
శ్రీకాకుళం	544.00